క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక



మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ మండల విద్యా వనరుల కేంద్రం మెసెంజర్ల యూనియన్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ భిక్షపతి ఆదివారం తెలిపాడు. జిల్లా అధ్యక్షుడిగా నెల్లికుదురు మండలానికి చెందిన యాకేష్, ప్రధాన కార్యదర్శిగా బయ్యారం మండలానికి చెందిన రమేశ్, ఉపాధ్యక్షులుగా కొత్తగూడెం మండలానికి చెందిన ఏ.రమేశ్, సహాయ కార్యదర్శిగా మానుకోట మండలానికి చెందిన దర్గయ్య, కోశాధికారిగా నరసింహులపేట చెందిన సైదులు, గౌరవ అధ్యక్షులుగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పార్వతిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం



కేసముద్రం: మండలంలోని కేసముద్రం విలేజ్‌కి చెందిన ఎస్‌కే మహిమూద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు ఆదివారం బాధిత కుటుంబానికి టీపీసీసీ ఓబీసీ, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల వీరన్న యాదవ్ క్వింటా బియ్యం అందించగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కలిసి రూ.8వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో గ్రామ ఉపాధ్యక్షుడు కత్తెర శాల శ్రీనివాస్, చిట్ల రవి, మాసాడి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన ఓరుగంటి సూరయ్య ఇటీవలే గుండెపోటుతో మృతి చెందాడు. ఈమేరకు ఆదివారం బాధిత కుటుంబానికి కేసముద్రం మండల ట్యాక్సీ డ్రైవర్స్, ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలుముల మహేష్ ఆధ్వర్యంలో రూ.31,500ల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పింగిలి సంతోష్, కార్యదర్శి నాగోల్ మీర, కోశాధికారి నర్సయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు జీవనభృతి అందించాలి

తొర్రూరు: వ్యవసాయ కూలీలకు జీవన భృతి అందించి ఆదుకోవాలని ప్రగతిశీల వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ముంజంపల్లి వీరన్న అన్నారు. వ్యవసాయ కూలీల సమస్యలపై వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ఆందోళన కార్యక్రమాల కరపత్రాలను ఆదివారం డివిజన్ కేంద్రంలో పంపిణీ చేశారు. వీరన్న మాట్లాడుతూ.. డిసెంబర్ 2న వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గజ్జి యాకన్న, వెంకటయ్య, పుల్లయ్య, షరీఫ్‌లు పాల్గొన్నారు.

సెలవులు మంజూరు చేయాలి



మహబూబాబాద్ అర్బన్: వేసవి సెలవుల్లో జరిగిన పార్లమెంట్ 2024 ఎన్నికల్లో, పదో తరగతి సప్లమెంటరీ పరీక్షల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంకబద్రి నారాయణ కోరారు. విద్యాశాఖ కార్యాలయంలో ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారి అంద్రు రవీందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు క్లెం వెంకటరెడ్డి, కనకయ్య, మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు భూక్యా రామోజీ నాయక్, కాపరబోయిన సుజాత పాల్గొన్నారు.

రోడ్లు బురదమయం



డోర్నకల్: మండలంలోని గుర్రాలకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని టేకులతండాలో సైడు కాల్వలు లేకపోవడంతో రోడ్లు బురదమయమవుతున్నాయి. వీధుల్లో మురుగు గుంతలు ఏర్పడి తీవ్ర దుర్గంధంతోపాటు దోమలు, ఈగలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి టేకులతండాలో సైడు కాల్వల నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మహాఅన్నదానం

మరిపెడ రూరల్: మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని శివాలయంలో దీక్ష స్వాములకు మరిపెడ సీఐ సట్ల రాజ్‌కుమార్‌గౌడ్–హరిణి, పాల్వాయి ప్రఫుల్ల కుమార్–మౌనిక దంపతులు మహాఅన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో చాపల శ్రీనివాస్‌రెడ్డి, వేణు, కొమ్మనబోయిన భిక్షం, నాగరాజు, శివ స్వాములు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు

- బాటసారులు, వాహనదారుల వెంటబడి కరుస్తున్న శునకాలు
- పట్టించుకోని అధికారులు



గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

గూడూరు: ఊర కుక్కలు ఒకటా.. రెండా పదుల సంఖ్యలో రోడ్లు, వీధుల్లో తిరుగుతూ బాటసారులను, వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో కుక్కల బెడద తప్పడం లేదని వాపోతున్నారు. ఏ గ్రామంలో చూసినా పదుల సంఖ్యలో తిరుగుతున్న ఊర కుక్కలు దారిన వెళ్లే వారిపై దాడులు చేయడం, ద్విచక్ర వాహనదారుల వెంట పరుగెత్తుకుంటూ వచ్చి కరవడానికి ప్రయత్నం చేస్తున్నాయి. దీంతో వాహనదారులు వేగంగా వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీ పాలకవర్గాల లేకపోవడం, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఏ గ్రామంలో చూసినా కుక్కల సంఖ్య గణనీయంగా పెరిగిందని పలుగ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఊర కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గూడూరులో వీధి కుక్కల పట్టివేత

గూడూరు మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ నూనావత్ రమేశ్‌నాయక్ ఇటీవల వీధుల్లో ఊర కుక్కల దాడుల్లో ఇబ్బందులు పడుతున్న ప్రజల కోరిక మేరకు నియంత్రణ చర్యలకు ఆదివారం శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గతంలో తాను సర్పంచ్‌గా ఉన్నపుడు కూడా కుక్కల నియంత్రణపై దృష్టి సారించినట్లు, ఇటీవల వాటి సంఖ్య పెరగడంతో ప్రధాన వీధుల్లోకి చిన్నారులు, వృద్ధులు రాలేక పోతున్నట్లు తనకు సమాచారం అందించారని తెలిపారు. తన సొంత ఖర్చులతో కుక్కలను పట్టే వారిని రప్పించి నివారణ చర్యలు చేపట్టానని పేర్కొన్నారు. విషయం తెల్సుకున్న పలువురు గ్రామస్తులు మాజీ సర్పంచ్ రమేశ్‌ను అభినందించారు.

హక్కులను కాలరాస్తే ఊరుకోం..

- మాజీ మంత్రి దయాకర్‌రావు



మాట్లాడుతున్న దయాకర్‌రావు

పెద్దవంగర/తొర్రూరు: రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తే ఊరుకోమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. నేడు జిల్లా కేంద్రంలో కేటీఆర్ ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దయాకర్‌రావు పాల్గొని మాట్లాడారు. లగచర్ల గ్రామంలో అక్రమంగా గిరిజనుల భూములు లాక్కొంటున్నారని, దీనిపై ప్రశ్నించిన గిరిజనలపై అక్రమ కేసులు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం వారిని ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ, శ్రీరాం సంజయ్, పటేల్ నాయక్, కృష్ణమూర్తి శర్మ, వెంకటరామయ్య, హరీష్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి

నెల్లికుదురు: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నేడు (సోమవారం) జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు పిలుపు ఇచ్చారు. ఆదివారం మండలంలోని నైనాల గ్రామంలో ఆయన మాట్లాడుతూ లగచర్ల ఘటనపై గిరిజన రైతులకు జరిగిన అన్యాయానికి వారికి అండగా నిలిచేందుకు నేడు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంటు కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలి ఆయన కోరారు.

మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం

- ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి



మాట్లాడుతున్న భిక్షపతి

గార్ల: బీజేపీ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడటమే ప్రజల ముందున్న తక్షణ కర్తవ్యం అని ఏకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి పిలుపునిచ్చారు. ఆదివారం మండలం లోని మద్దివంచ గ్రామంలో అమరవీరుల స్థూపాల ఆవిష్కరణ అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ మతోన్మాద ఫాసిస్ట్ విధానాలను అమలు పరుస్తూ దేశంలో లౌకిక ప్రజాస్వామిక విలువలను ధ్వంసం చేస్తుందని ఆరోపించారు. అదాని, అంబానీల కోసం దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని మోదీ ప్రభుత్వం అప్పనంగా ధారాదత్తం చేసిందని ఆరోపించారు. న్యూడెమోక్రసీ గ్రామ కార్యదర్శి గౌని భద్రయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు అనురాధ, పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, మోకాళ్ల మురళీకృష్ణ, ఐఎఫ్టీయూ రాష్ట ఉపాధ్యక్షుడు జే సీతారామయ్య, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడ సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి జి.సక్రు, అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి ఈ శ్రీశైలం, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బోనగిరి మధు, పద్మ, ఐలమ్మ, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

కారు, ట్రాలీఆటో ఢీ.. నలుగురికి గాయాలు

మరిపెడ రూరల్: కారు, ట్రాలీఆటో ఢీకొని కారు ఆకేరు వాగులోకి దూసుకెళ్లగా నలుగురికి గాయాలైన సంఘటన మండలంలోని పురుషోత్తమాయగూడెం ఆకేరు బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటు చేసుకుంది. కురవి మండలం కాంపెల్లి గ్రామానికి చెందిన రాజేష్, గౌతమ్, గణేష్ కలిసి కారులో వయా మరిపెడ మీదుగా తిరుమలగిరి వెళ్తున్నారు. ఈక్రమంలో ఓ ట్రాలీఆటో మహబూబాబాద్ వైపు వెళ్తోంది. కారు, ట్రాలీఆటో ఎదురెదురుగా ఢీకొనడంతో కారు అదుపు తప్పి ఆకేరు వాగులోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులతోపాటు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ పఠాన్, పైలెట్ ప్రవీణ్ తెలిపారు.

జీఓ, నిధులపై సమాధానం చెప్పాలి

- సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి



మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

నెహ్రూసెంటర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మానుకోట అభివృద్ధికి జారీ చేసిన జీఓలు, విడుదల చేసిన నిధులపై మానుకోట పర్యటనకు వస్తున్న కేటీఆర్ సమాధానం చెప్పాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పురపాలకశాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ చట్టబద్ధంగా ఇచ్చిన ప్రభుత్వ జీఓలు 34, 367 కేటాయించిన రూ.52 కోట్లపై సమాధానం చెప్పాలన్నారు. మెడికల్ కళాశాల కోసం గిరిజనుల భూములు లాక్కొని మహిళలపై కేసులు పెట్టి జైలుకు పంపించి ఇప్పుడు గిరిజనుల కోసం ధర్నా చేయడం హాస్యాస్పదమన్నారు. ఈ సమావేశంలో పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, మాలోత్ రవీందర్ పాల్గొన్నారు.

షరతులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాసరావు

గార్ల: కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశాడు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తేమశాతం అధికంగా ఉందని కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. అదే విధంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు అయినంక మిల్లర్లు రైతులను పిలిపించి ధాన్యంలో తేమశాతం అధికంగా ఉందని, తాలు ఉందని లేనిపోని షరతులు పెట్టి మిల్లర్లు క్వింటాకు తరుగు పేరున 2నుంచి 3కేజీలు తీస్తే ఊరుకునేది లేదన్నారు. ధాన్యం కొనుగోళ్లు అయిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి అలువాల సత్యవతి, జిల్లా కమిటీ సభ్యుడు హరి, వెంకటేశ్వర్లు, రాజారావు, నాగమణి పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

తొర్రూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఓమ భిక్షపతి అన్నారు. మండలంలోని మడిపల్లి, అమ్మాపురం, గుర్తూరు, కంఠాయపాలెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతు సంఘాల ఆధ్వర్యంలో సందర్శించారు. ఈనెల 26న మహబూబాబాద్‌లో రైతాంగ నిరసనలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యాకూబ్, వీరన్న, సాయిలు, ఎల్లయ్య పాల్గొన్నారు.

ప్రజాపాలనపై కళాజాతా



కళాజాతా నిర్వహిస్తున్న కళాకారులు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం అబ్బాయిపాలెం, మరిపెడ, ఎల్లంపేట గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది ప్రజాపాలన విజయోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కళాజాతా నిర్వహించారు. ఈసందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి బండి వెంకన్న కళాబృందం ఆధ్వర్యంలో ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలుపై ప్రజలకు కళాకారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు కొమిరె వెంకన్న, మిట్టగడుపు భరత్, కందుకూరి అనిల్, వంగూరి శ్రీనివాస్, పోతురాము అశ్విని, చెడుపాక కవిత, ఈసం సింధూజ పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనను జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: కేంద్ర ప్రభుత్వం, మోదీ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26వ తేదీన జరగనున్న నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పర్వత కోటేష్, హెచ్.లింగన్న పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమాల కరపత్రాలను సంఘ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేళ్ల మోదీ పాలనలో ఇచ్చిన హామీలను విస్మరించి, ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడ్డారని విమర్శించారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యూలరైజ్ చేయాలని, ఖాళీలుగా ఉన్న ఉద్యోగ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో ఎండి జబ్బార్, తెల్లబోయిన లక్ష్మయ్య, సయ్యద్, నిజాముద్దీన్, తెల్లబోయిన కృష్ణ, యాకంబ్రం పాల్గొన్నారు.

భగీరథ నీరు రోడ్డు పాలు



పగిలిన భగీరథ పైపు

డోర్నకల్: డోర్నకల్‌తో పాటు పలు గ్రామాల్లో భగీరథ పైపులు పగలడంతోపాటు కొన్ని ప్రాంతాల్లో పైపులు లీకవడంతో నీరంతా వృథాగా పోతోంది. మల్లాయికుంటతండా నుంచి మన్నెగూడెం వెళ్లే దారిలో నాలుగు నెలల క్రితం పైపు పగిలి నీరు వృథాగా పోతున్నాయి. గొల్లచర్ల స్టేజీ డబుల్ బెడ్రూం కాలనీలో రోడ్డు పక్కన భూమిలో పైపులు పగిలి చాలా రోజులుగా భగీరథ నీరు రోడ్డు మీద ప్రవహిస్తున్నా అధికారులు సమస్యపై దృష్టి సారించలేదు. ఉయ్యాలవాడ క్రాస్ రోడ్డు, ముల్కలపల్లి మార్గంలో రోడ్డు పక్కన అనేక ప్రాంతాల్లో పైపులు లీకేజీతో నీరు వృథాగా పోతోంది.

విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలి



వంటలను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లికుదురు: వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి జినుగు మరియన్న వసతి గృహాల నిర్వాహకులకు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఆదర్శ మోడల్ బాలికల వసతి గృహం, కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహ, సంక్షేమ బాలుర వసతి గృహాలను తహసీల్దార్ కోడిచింతల రాజు, ఎంపీడీఓ బాలరాజుతో కలిసి ఆదివారం ఆయన సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. వంటశాలలు, స్టాక్ రూం, మరుగుదొడ్లు, వంటలను తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, ప్రిన్సిపాల్ సుమలత, వార్డెన్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సామూహిక వ్రతాలు



గార్ల: కార్తీకమాసంను పురస్కరించుకొని ఆదివారం గార్ల సమీపంలోని మర్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామి ఆలయం కల్యాణ మండపంలో ఆర్యవైశ్యులు సామూహిక సత్యనారాయణ స్వామివ్రతాలు ఘనంగా నిర్వహించారు. వ్రతాల అనంతరం ఆర్యవైశ్యులు వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పుల్లఖండం వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి కనకశేఖరం, రమేష్‌బాబు, ఒబిలిశెట్టి కృష్ణ, అత్తులూరి సత్యం, రాంబాబు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ వెలుగులు

గూడూరు: మండల కేంద్రంలోని 365 జాతీయ రహదారిపై పెండింగ్‌లో ఉన్న సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను జిల్లా కాంగ్రెస్ నాయకుడు వాంకుడోతు కొమ్మాలునాయక్ సొంత ఖర్చులతో సరఫరా అందించడంతో వెలుగులు జిమ్మాయి. గూడూరు మీదుగా 5ఏళ్ల క్రితం గూడూరు మీదుగా ప్రారంభమైన ఎన్‌హెచ్ పనులు అసంపూర్తిగా నిలిచాయి. సొంత ఖర్చులతో సరఫరా అందించగా, పట్టణవాసులు ఆయనను అభినందించారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక





కురవి: యూటీఎఫ్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే యాకుబ్ ఆదివారం తెలిపాడు. మండల అధ్యక్షురాలిగా పి.మంజూల, ప్రధాన కార్యదర్శిగా ఎం.ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా డి.వీరన్న, ఎస్.శైలజ, కోశాధికారిగా జి.బాలరాజు, కార్యదర్శులుగా ప్రదీప్, బాబు, సురేష్, రమ్య, మల్లయ్య, మాధవి, వరప్రసాద్, ఆడిటర్‌గా ఎస్‌కె సలీం, సభ్యుడిగా భాస్కర్ ఎన్నికయ్యారు.

పరామర్శ..

నెహ్రూసెంటర్: టీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు గుగులోత్ రవినాయక్ తండ్రి ఈర్యానాయక్ ఇటీవల మృతి చెందగా మేఘ్యతండాలో ఈర్యానాయక్ చిత్రపటానికి పూలమాల వేసి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం నివాళులర్పించారు. ఆయన వెంట రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షుడు వెంపటి సతీష్‌రెడ్డి, గుడిపుడి నవీన్‌రావు, కుడితి మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట లాలయ్య, నాయకులు ఉన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణం

మహబూబాబాద్ రూరల్: మానుకోట పట్టణంలోని వేంకటేశ్వర బజార్‌లో గల స్వయంభూ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో సోమవారం ఉదయం 11గంటలకు శ్రీపద్మావతి శ్రీనివాసుల కల్యాణ మహోత్సవం వైభవోపేతంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు అలుగువెల్లి వీరభద్రం ఆదివారం తెలిపారు. శ్రీరామ ఆలయం నుంచి ఉభయ దేవేరుల ఉత్సవ మూర్తుల విగ్రహాలను బ్యాండ్‌వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయ ప్రాంగణంలో కల్యాణ జరిపిస్తారన్నారు. భక్తులు స్వామివారి కల్యాణోత్సవానికి హాజరై అనుగ్రహం పొందాలన్నారు.

వనభోజనాలు

బయ్యారం: బయ్యారంలో కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కమ్మ కులస్తులందరూ ఐక్యంగా సమాజాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శేషగిరిరావు, వెంకటనారాయణ, మాధవరావు, మధు, బాబూరావు, ఉప్పలయ్య పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన దైద వెంకన్న

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ లో సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ఐఏఎస్ హరీశ్‌ను, రీజినల్ జాయింట్ డైరెక్టర్ జగన్‌ను ప్రకృతి వనప్రేమికుడు దైద వెంకన్న ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలను అందించారు.

ఘనంగా సుదర్శన హోమం

కేసముద్రం: కార్తీక మాసం సందర్భంగా ఇనుగుర్తి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఒద్దిరాజు చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుదర్శన హోమం, శాంతి కల్యాణ వేడుకలను భక్తి శ్రద్ధలతో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఒద్దిరాజు సుభాష్, శ్యాం సుందర్ రావు, పండితులు బద్రినాద్, కృష్ణామాచార్యులు, నర్సింహపట్టాభి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మృతి

గార్ల: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య(70) నియోజవర్గ అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని సీపీఐ రాష్ట్ర నాయకుడు కట్టెబోయిన శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం అబ్బయ్య మృతి చెందగా ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకన్న, మాగం లోకేష్, రాగం రమేశ్, యాకూబ్‌మియా, వీరన్న ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నెహ్రూసెంటర్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన వ్యక్తి అస్వస్థతతో శనివారం మధ్యాహ్నం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. చికిత్స ప్రారంభించగా ఆదివారం మధ్యాహ్నం పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. వైద్యుడు నిర్లక్ష్యం కారణంతోనే మృతి చెందినట్లు బంధువులు ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు.

పాలేరువాగు లోలెవల్ బ్రిడ్జి పునరుద్ధరణ



మట్టి పోసి చదును చేసిన రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

మరిపెడ రూరల్: మరిపెడ మండలం తానంచర్ల రెవెన్యూ పరిధిలోని గంగాభవాన్ని ఆలయ సమీపంలో పాలేరు వాగుపై నిర్మించిన లోలెవల్ వంతెన రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు సీసీ కొట్టుకుపోయింది. దీంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 'వాగు దాటేదెట్లా' అనే కథనం 'సాక్షి'లో ఇటీవల ప్రచురితమైన విషయం విధితమే. కాగా ప్రభుత్వం స్పందించి తాత్కాలిక లోలెవల్ వంతెన మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ ఆదేశాల మేరకు అజ్మీర శ్రీనివాస్, అజ్మీర కిషన్ ఆధ్వర్యంలో మట్టి పోసి చదును చేశారు. అదేవిధంగా మండలంలోని తాళ్లఊకల్ గ్రామ శివారు పాలేరు వాగుపై నిర్మించి బ్రిడ్జి మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో రఘు, రవీందర్‌తో పాటు గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: మండల కేంద్రంలో డిసెంబర్ 1న టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కంకర బోర్డు ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు మేకల కుమార్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బానోత్ హరినాయక్, మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సీనియర్ సభ్యుడు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

తొర్రూరు: వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం మండలంలోని చెర్లపాలెం బీసీ బాలుర వసతిగృహాన్ని ఆయన పరిశీలించారు. స్టాక్‌రూం, వసతిగృహ పరిసరాలను పరిశీలించి వార్డెన్ గంటా భాస్కర్‌కు పలు సూచనలు చేశారు.

రివార్డు పొందిన ఎస్సైలకు సన్మానం



మరిపెడ రూరల్: విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి తెలంగాణ డీజీపీ చేతుల మీదుగా రివార్డు, ప్రశంసలు అందుకున్న మరిపెడ ఎస్సై బొలగాని సతీష్‌ను కాంగ్రెస్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ తాజుద్దీన్, నాయకులు షేక్ అఫ్జల్, సర్వర్, ఫ్రూట్ అఫ్సర్, రవి పాల్గొన్నారు.

బయ్యారం: డీజీపీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న బయ్యారం ఎస్సై తిరుపతిని ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్య మాదిగ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకపోడు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పులి శ్రీను, మహాజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ రాధ పాల్గొన్నారు.